క్లుప్తంగా

సామూహిక వ్రతాలు



అవనిగడ్డ: శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి నరసింహమూర్తి బ్రహ్మత్వంలో 25 మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

నాగాయలంక: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ. సంజీవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 18,500 ఎకరాలు కాగా ఇప్పటివరకు 4,150 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని చెప్పారు. సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 1500 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. ఇప్పటికే నాట్లు పూర్తి చేసిన వారు, నాట్లు వేయాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించి తమ పంట వివరాలను ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

బీఎల్ఓ విధుల నుంచి మినహాయించాలి

కోనేరుసెంటర్: వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎమినిటీస్ సెక్రటరీలకు బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఎమినిటీస్ సెక్రటరీలు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీ విద్యను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వైజ్‌మెన్ క్లబ్, అజ్మీర్‌బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం సర్కారుతోటలోని వాసవీ వృద్ధాశ్రమంలో కళ్లకలక నివారణ హోమియో మందులను వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. సయ్యద్ బాజీ, హోమియో వైద్యులు ఎస్. ప్రభాకరరావు, ఎ. శ్రీనివాస్ వైద్యసేవలు అందించారు. కళ్లకలక సోకిన వారు కళ్లద్దాలను పెట్టుకోవాలని సూచించారు.

వెంకటేశ్వరస్వామి కల్యాణం

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో జయలక్ష్మీ మాత మాతృ మండలి ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అత్రి వరద దత్తాత్రేయ స్వామి వారికి తైలాభిషేకం చేశారు. కార్యక్రమానికి హాజరైన సువాసినిలకు జాకెట్ ముక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

బచ్చుపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

నగరంలోని బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుద్ధ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారి వ్రతం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవికాంత్, ఈఓ చక్రధరరావు పర్యవేక్షించారు.

సీపీఎం ప్రభాత భేరీ

అవనిగడ్డ: సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలను పురస్కరించుకుని అవనిగడ్డలో ఆదివారం ప్రభాత భేరీ కార్యక్రమం నిర్వహించారు. కోర్టు సెంటర్, ఎనిమిదో వార్డు, మసీద్ సెంటర్, చింతచెట్టు సెంటర్, బ్యాంకు సెంటర్ మీదుగా ఆర్య వైశ్య కల్యాణ మండపం వరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతోందని, పెంచిన పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, నాయకులు శీలం నారాయణరావు, యద్దనపూడి మధు, చౌటపల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

కైకలూరు: శ్రావణమాసం సందర్భంగా కైకలూరు వాసవీ కన్యకా పరమేశ్వరికి కంతేటి వంశస్తులు శ్రావణమాస సారెను ఆదివారం సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు చొప్పర్ల మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి సెప్టెంబరు 8 వరకు దేవాలయంలో అమ్మవారి 43వ శ్రావణ మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సెప్టెంబరు 1న మహాలక్ష్మీ వ్రతం, 8న సామూహిక కంకుమార్చన జరుపుతామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొప్పర్తి గోపాలకృష్ణమూర్తి, ఎస్‌వీఎస్ఎస్ బసవరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

సురక్షతో సత్ఫలితాలు

- లబ్ధిదారులకు చేరువైన సేవలు
- బందరు మండలంలో మొత్తం 6,426 వినతులు
- వాటిలో 6,357 వినతులు పరిష్కారం
- పెండింగ్‌లో ఉన్నవి 69 మాత్రమే



అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పేర్ని కిట్టు (ఫైల్)

కోనేరుసెంటర్: ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో సత్ఫలితాలను ఇచ్చింది. అన్ని అర్హతలు ఉండీ చిన్న చిన్న కారణాలతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న ప్రజలను గుర్తించి వారికి సత్వరమే న్యాయం చేయాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక నేతలతో పాటు వలంటీర్లు, అన్ని విభాగాల అధికారులను చిత్తశుద్ధితో పనిచేసేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు అంకితభావంతో పనిచేసి మండలంలో 99 శాతానికి పైగా సత్ఫలితాలను సాధించేందుకు విశేష కృషి చేసి మండలంలో మంచి ఫలితాలు సాధించారు. దీంతో మండల ప్రజలు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరేలా..

మండల ప్రజలకు ప్రభుత్వం అందించే పథకాలు, సేవలను చేరువ చేసేందుకు బందరు మండలంలోని 26 సచివాలయాల పరిధిలో జులై ఒకటో తేదీ నుంచి 28వ తేదీ వరకు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, వలంటీర్‌లు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం తరఫున ఒకే సారి 11 రకాల సేవలను ప్రజలు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అర్హత ఉండీ అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందని వారి జాబితాను వలంటీర్లు ముందుగానే సిద్ధం చేసి జగనన్న సురక్ష శిబిరం ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అలా మండలంలోని 26 సచివాలయాల పరిధిలో 6, 426 వినతులను అందుకున్న అధికారులు అక్కడికక్కడే 6,357 ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించి ప్రశంసలందుకున్నారు. ఎన్నో ఏళ్లగా అర్హత ఉండీ అవసరమైన పత్రాలు పొందలేని వేలాదిమంది ప్రజలు ముఖ్యమంత్రి తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఫిదా అయ్యారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు ప్రయత్నించినా పత్రాలు అందని అనేకమంది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఇళ్ల వద్దకే వలంటీర్లను పంపి ఎటువంటి రుసుం తీసుకోకుండా ధ్రువీకరణ పత్రాలను అందించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

99 శాతానికి పైగా పరిష్కారం..

రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోరుతూ మండల ప్రజల నుంచి సుమారు 5,649 వినతులను అందగా 5,580 వినతులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 93 వినతులు అందగా నూటికి నూరు శాతం పరిష్కరించారు. ఇతర విభాగాలకు సంబంధించి 684 వినతులు రాగా వాటన్నంటిని పరిష్కరించారు.

నిమిషాల్లో చేతికి కుల ధ్రువీకరణ పత్రం



నా పేరు కట్టా ఏసోబు, ఊరు బందరు మండలం కరగ్రహారం గ్రామం, అనేకసార్లు కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలుసుకుని కుల ధ్రువీకరణ పత్రం కోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా. ఐదే ఐదు నిమిషాల్లో అధికారులు కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

– కట్టా ఏసోబు, కరగ్రహారం

11 రకాల సేవలు అందించాం



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసింది. వలంటీర్ల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రభుత్వం సమన్వయం చేసింది. 11 రకాల ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కార్యక్రమం నిర్వహించాం. సత్ఫలితాలు సాధించాం.

– బాలకృష్ణ, ఎంపీడీఓ

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చల్లపల్లి: చల్లపల్లి మండలంలో నాలుగు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ చేకు చిన ముత్యాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నడకుదురులో ఒకటి, వక్కలగడ్డలో ఒకటి, లక్ష్మీపురంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల వారు ఈనెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్ లింక్ చేయాలి

మోపిదేవి: విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్ లింక్ చేయించాలని మండల విద్యుత్ ఏఈ పాండురంగారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్ లింకు చేస్తారని చెప్పారు. వినియోగదారుల కరెంట్ బిల్లు, సర్వీస్ నెంబర్ గల వారు ఒరిజినల్ ఆధార్ కార్డుతో సంప్రదించాలని సూచించారు.

పెడన పీహెచ్‌సీ ఉద్యోగుల బదిలీ

పెడన: పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఎంపీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఎం. వీరయ్య ఎదురుమొండికి బదిలీ అయ్యారు. ఎంపీహెచ్ఎస్ గొరిపర్తి శ్రీనివాసరావు ఏలూరు జిల్లా లింగపాలెం పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. మరో ఎంపీహెచ్ఓ ప్రకాశరావు కొతవరం పీహెచ్‌సీకి వెళ్లారు. పీహెచ్ఎన్‌గా ఉన్న పైడేశ్వరమ్మ పెడన మండలం చేవేంద్ర పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. వీరి స్థానాల్లో ఇంకా ఎవరు వచ్చేది తెలియరాలేదు. వీరంతా ఒకటి, రెండు రోజుల్లో విధుల నుంచి రిలీవ్ అయి బదిలీ అయిన ప్రాంతాల్లో చేరనున్నారని వైద్యాధికారులు తెలిపారు.

'ఇన్‌స్పైర్'కు ఎంపిక చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమానికి విద్యార్థులను ఈ నెల 31వ తేదీలోగా ఎంపిక చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహేరా సుల్తానా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఒక్కొక్క పాఠశాల నుంచి ఐదుగురు చొప్పున ఉపాధ్యాయులు ఎంపిక చేయాలన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాలని ఆమె సూచించారు.

అగ్ని బాధితులకు సాయం

అవనిగడ్డ: స్థానిక ప్రధాన రహదారి పక్కన ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన కేశాన దానయ్య, సూరగం నాగమల్లి కుటుంబాలకు శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రూ.9,420 విలువగల దుస్తులు, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. సేవా సమితి నిర్వాహకులు సనకా నాగ మునీశ్వరరావు, రఘువీర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు వ్యవసాయ కూలీ మృతి



నాగమణి మృతదేహం

గూడూరు: మండల పరిధి మల్లవోలు గ్రామంలో పాము కాటుకు మహిళ మృతి చెందింది. గూడూరు ఎస్‌ఐ వి. వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవోలు గ్రామ శివారు ముత్రా సిపాలెంకు చెందిన పరసా నాగమణి (43)ఆదివారం ఉదయం సమీపంలోని పంట పొలాల్లో కలుపుతీత పనులకు వెళ్లింది. కలుపుతీత పనుల్లో నిమగ్నమైన నాగమణికి పాము కాటు వేసింది. తోటి కూలీలు నాగమణిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గూడూరు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం

చల్లపల్లి: స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ గృహం వృద్ధాశ్రమానికి దాతలు సాయం చేశారు. ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన పెనుమాక సారథి వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్ అందజేశారు.

రేపటి నుంచి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

పెడన: మండలంలోని పలు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు శిక్షణకు హాజరుకావాలని ఎంపీడీఓ వి. రెడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మడక, నడుపూరు, నందమూరు, పుల్లపాడు, బల్లిపర్రు, గురువిందగుంట, కొప్పల్లి గ్రామ సచివాలయాలకు చెందిన గ్రేడ్-5 కార్యదర్శులు మచిలీపట్నం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో జరిగే శిక్షణకు హాజరుకావాలని చెప్పారు.

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ఘంటసాల(అవనిగడ్డ): సంక్షేమ పథకాల అమలులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండల పరిధి శ్రీకాకుళంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా అమలుకాని పథకాలు మన రాష్ట్రంలో అమలు అవుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే మరిన్ని సంక్షేమ పథకాల అమలు సాధ్యమన్నారు. అన్నివర్గాల ప్రజలకు అర్హతే ప్రామాణికంగా పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మరోసారి వైఎస్సార్ సీపీకి అవకాశం ఇస్తే మన రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళతారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకీ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. నాడు– నేడుతో విద్య, వైద్యంలో పెను మార్పులు తీసుకొచ్చారని, రైతుల కోసం అమలు అవుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి రమేష్, చిట్టితల్లి, పడమటి వీరకుమార్, తాతినేని కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇషా గ్రామోత్సవ క్రీడలు



విజేతలతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బహుమతులు అందించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో వాలీబాల్‌లో 20 జట్లు పోటీపడగా, మహిళా విభాగంలో త్రోబాల్‌లో 19 జట్లు తలపడ్డాయి. క్రీడా పోటీల విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.9 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేలు, నాలుగో బహుమతిగా రూ.2 వేలు నగదును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు దోహద పడతాయని చెప్పారు. నిర్వాహకులు ఇషా ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బచ్చు ఆదినారాయణ, వ్యాయామోపాధ్యాయులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

125 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు హారిక, మేఘన. చిత్రంలో సంస్థ ప్రతినిధులు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పర్యాటక శాఖ ఫుడ్ కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ప్రారంభించారు. 125 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 105 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి శస్త్రచికిత్సల కోసం రెండు ప్రత్యేక బస్సుల్లో ఆస్పత్రికి పంపించారు. డాక్టర్ హారిక, డాక్టర్ మేఘన వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి ఎం.రవికుమార్, జమీలా మస్తాన్, కనిగంటి వెంకట నారాయణ, తలశిల లీలామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొడాలి పీఏసీఎస్‌లో..

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం కొడాలి పీఏసీఎస్‌లో చైర్మన్ పరుచూరి రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రేలంగి శిరీష 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 130 మందికి పీఏసీఎస్ ఆర్థిక సహాయంతో ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఆరుగురికి కంటి ఆపరేషన్ అవసరం కాగా ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో ఉచితంగా చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్మన్ తాతినేని కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పడమట వీరకుమార్, పీఏసీఎస్ సీఈఓ తుమ్మల ఆదినారాయణ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

మచిలీపట్నంటౌన్: మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం స్థానిక చిలకలపూడి సెంటర్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆదివారం ఘనంగా జరిగింది. నవ చైతన్య మదర్ థెరిస్సా సేవా సమితి 17వ వార్షికోత్సవాన్ని కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి, బోదకాలు వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యుడు నాగరాజు అవగాహన కల్పించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, గౌరవాధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి కుమ్మరి జలాచంద్రుడు, ఉపాధ్యక్షుడు అల్లాడ రాజా, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మరి హర్ష తదితరులు పాల్గొన్నారు. తొలుత మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు.

అపూర్వం .. ఆత్మీయ సమ్మేళనం



తాడంకి హైస్కూల్‌లో గురువులతో 1972-73 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు


తాడంకి హైస్కూల్‌లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు

పమిడిముక్కల: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. తాడంకి హైస్కూల్‌లో ఆదివారం ఆ పాఠశాల 1972–73 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. గోల్డెన్‌జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. 50 సంవత్సరాల కితం చదువుకొన్న విద్యార్థులు 65 సంవత్సరాల వయస్సులో కలుసుకున్నారు. చదువుకొనే రోజుల్లో జరిగిన సంఘటనలను గుర్తుచేసుకొన్నారు. పాఠశాల ఆవరణంతా కలియతిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా..ఉల్లాసంగా గడిపారు. తమకు పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను సత్కరించారు. హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలని నిర్ణయం తీసుకొన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన ఈడే శ్యామల రేఖకు రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన జలసూత్రం హేమకు రూ.10 వేలు, తృతీయ స్థానం పొందిన యశ్వంత్‌కు రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, హెచ్‌ఎం ప్రసాద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కంభపు రాంబాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు యేనుగ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విజేతల బహుమతులకు విరాళం

అవనిగడ్డ: సబ్ జోన్ క్రీడా పోటీల విజేతలకు బహుమతులకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాం కిశోర్ నాయుడు రూ.10 వేలు విరాళం అందించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కోశాధికారి మునగాల ఉదయ కుమార్‌కు శ్యాం కిశోర్ నాయుడు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు రేమాల శ్రీనివాసరావు, తోట నరసింహనాయుడు, సాయి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాంచారమ్మకు జలాభిషేకం



అమ్మవారి మూలమూర్తికి జలాభిషేకం

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఆదివారం జలాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ భక్తులు అమ్మవారి మూలమూర్తికి 109 బిందెల నీటితో అభిషేకం చేశారు. గ్రామానికి చెందిన తోట ప్రేమ్‌సాయి ఆలయానికి 101 స్టీల్ బిందెలను అందించారు. ముందుగా బిందెల్లోని నీటికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణమాసంలో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని పూజలు చేశామని ప్రధాన అర్చకుడు పార్థసారధి తెలిపారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రేమ్‌సాయి అమ్మవారి పూజలకు అవసరమైన ఇత్తడి సామగ్రిని విరాళంగా అందించారు. ప్రేమ్‌సాయి కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ దుశ్శాలువాలతో సత్కరించింది. ఆలయ చైర్మన్ ముప్పిరిశెట్టి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆపద ప్రబంధన్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం–2024కి ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు ఆదివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్య కార్యదర్శి కమలకిషోర్ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ పురస్కారాలు ప్రకటిస్తారని చెప్పారు. విపత్తుల నిర్వహణ రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తారన్నారు. దరఖాస్తులు వెబ్‌సైట్ https://awards.gov.in అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఎవరైనా విపత్తుల సందర్భంగా విశేష సేవలు అందించిన వ్యక్తులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు చినగొల్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఉదయం చినగొల్లపాలెం పంచాయతీలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. చినగొల్లపాలెం-2 సచివాలయం పరిధిలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.